**కథ**

# పట్టుచీర

ముకుందరావుది అదోరకం మన స్తత్వం. పిల్లికి బిచ్చం పెట్టడు. ఈ భూగోళం మీదున్న చాలామందికన్నా అలా పిల్లికి బిచ్చం పెట్టకపోవటం ఏమంత విలక్షణమేమీ కాదుగానీ పిల్లి ఎక్కడో తెచ్చుకున్న బిచ్చాన్ని కూడా రాయితో కొట్టి లాక్కుంటాడు కను కనే అతగాడు కథా వస్తువయ్యాడు.

ముకుందరావును గురించి నలుగురూ నానా రకాలుగా ఎలా కథలు అల్లి చెప్పుకొంటుంటారో! ఆ కథలు ఆప్తమిత్రుల ద్వారా చివరికి అతగాడి చెవికే సోకినా ప్రపంచపు అజ్ఞానాన్ని గురించి గుంభనంగా నవ్వుకోటం మినహా అత గాడు ఎవర్నీ పల్లెత్తుమాట అన్న సందర్భాలే లేవు.

రెవిన్యూ శాఖలో ఉద్యోగి ముకుందరావు. జీతం ఆరేడు వేలకు పైనే వస్తుంది ప్రతి నెలా.

అసలు పోటుకన్నా జంధ్యం పోటు ఎక్కువన్నట్టు అతగా డికి జీతం కన్నా పై సంపాదనే ఎక్కువ. వెరసి ప్రతినెలా పది వేలకు పైనే కళ్ళ చూడందే కంటిమీదికి కునుకే తెచ్చుకోడు ముకుందరావు.

బంధువులూ, స్నేహితులూ వేసే అంచనాల ప్రకారం అత గాడి ఆదాయాన్నీ, పిసినారితనాన్నీ దృష్టిలో వుంచుకొని కనీసం ఆస్తులు కాక పది లక్షల రూపాయలకు పైగానే నిలువచేసి వుంటాడని! వాళ్ళందరూ అతగాడికిచ్చే గౌరవమర్యాదలూ ఆ అంచనాలను బట్టే అవసరానికి మించి వుంటోన్నాయి!

ముకుందరావు భార్య ఆదిలక్ష్మికీ, కొడుకు రామబ్రహ్మానికీ తప్ప ప్రపంచానికి తెలియని విషయం ఏమిటంటే ముకుంద రావుకు బ్యాంకు బ్యాలెన్సులు రెండొందలు మించి లేవు. అది కూడా 'మినిమం' వుండాలన్న నిబంధనలు పెట్టారు గనుక గత్యంతరం లేక వుంచాడు తప్ప మరొకటి కాదు. పెద్దలు ఇచ్చిన ఆస్తిపాస్తులు తప్ప అదనంగా కొన్నది కూడా సెంటు భూమి లేదు.

అంతదాకా ఎందుకూ! తను కోరుకుంటున్న నెమలి పింఛం రంగు కంచిపట్టు చీర కోసం భర్తతో దాదాపు దశాబ్దం నించి విసుగూ విరామం లేకుండా పోరకాడుతూనే వుంది ఆది లక్ష్మి. అయినా యింతవరకూ అమిరి చస్తేనా!

ఆరోజు భర్త మూడ్ కనిపెట్టి అతగాడు హుషారుగా వున్నా డనగానే దగ్గరికి వెళ్లింది. ముఖాన్ని సాధ్యమైనంత జాలిగా పెట్టి-

"యావండోయ్! ఇంకా మీరు సూపర్నెంటు పని చేస్తూ గూడా నాకు పట్టుచీర కొనిపెట్టలేదు. అదే మీ ఆఫీసులో ఆఫ్టాల్ అటెండరుగా చేస్తున్న ఆనందరావు మొన్న భార్యకు పట్టు చీర తెచ్చాడు తెలుసా!

నిన్న శ్రావణ శుక్రవారం. గుడికి వెళ్తే అతగాడి భార్య వరాలు కనిపించింది. ఆ పట్టు చీర కట్టుకొని ఎలా కులుకుతూ గుడికి వచ్చిందో చెప్పలేను. పైగా వచ్చింది తన మానాన తను వచ్చిన పని చూసుకొని వెళ్ళిందా అంటే అదీ లేదు.

అయ్యవారు గర్భగుడిలో కర్పూరం వెలిగిస్తోంటే హడావు డిగా వచ్చింది. ఎగిరెగిరి నాలుగుసార్లు గంటలు కొట్టింది. నా ప్రక్కకు వచ్చి నిలబడి "శ్రావణ శుక్రవారం కదా అని మావార్ని అడగ్గాన్నే అప్పటికప్పుడు బజారుకు వెళ్లి ఈ చీర తెచ్చారు బావుందా?" అని అడిగింది.

"బాగుంది" అనక చస్తానా! నిజానికి అలా అన్నందుకు నా ప్రాణం చచ్చేపోయిందనుకోండి.

సమయానికి అయ్యవారు హారతి పళ్ళెంతో గర్భగుడి గడ పదాటి వచ్చారు గనుక దణ్ణం పెట్టుకొని బైట పడ్డాను గానీ, లేకుంటే అది దాని పట్టుచీర గురించి యింకా ఎన్ని కథలు చెప్పి విసిగించేదో..."

"ఇంతకూ ఏంటి సంగతి?" అడిగేడు మధ్యలోనే ముకుందరావు.

"ఎరియర్సేవో వొచ్చాయటగా! ఈ బరువులూ బాధ్య తలూ ఎప్పుడూ వుండేవే. నలుగుర్లో తిరగాల్నంటే సూప ర్నెంటు భార్యేమిటి ఇలా వాయిల్ చీరలు కట్టి గుళ్ళకు రావట మేంటీ అని అనుకుంటారని అభిమానంతో చస్తున్నాను."

> **ఆమె అందాన్ని, ఆమె చుట్టూ వల యంలా అల్లుకున్న కాంతినీ, ఆమె మేని సుగంధ పరిమళాన్ని వర్ణించేం దుకు తగిన భాష లేదనుకున్నాడు ముకుందరావు. అంతదాకా ఎందుకూ! సర్వలోకాల్లోనూ వున్న అందగత్తెలందర్నీ దేవ వేశ్యలతో సహా ఒక చోటికి చేర్చి కోరుకోమంటే నల కూబరుడు కూడా రంభను కోరు కోడు-వసుంధరను తప్ప!**

"ఏం చెయ్యమంటావ్?"

"నాకొక పట్టుచీర పట్టుకురండి. సుబ్బారావు కొట్లో వుంది. నాకు నచ్చింది. మొన్న అనసూయమ్మగారు బట్టలు కొనాల్నంటే తోడువెళ్లి చూసొచ్చాను. నెమలి పింఛం రంగూ..గోధుమరంగు గళ్ళూ..మధ్యలో వెండి బుటా.."

"చాల్చాలు..ఇద్దరాడాళ్ళొచ్చి కొట్టంతా ఏకం చేసి బాగుంది అన్న పట్టు చీర ఇవ్వండంటే క్షణాల మీద తీసి స్తారు. డబ్బుల్దే సమస్య!" అని ముఖం ప్రక్కకు తిప్పి పైన తిరుగుతోన్న సీలింగు ఫ్యాన్ను చూస్తూ నిల్చున్నాడు ముకుంద రావు.

ఆదిలక్ష్మికి చిర్రెత్తుకొచ్చింది.

"ఎరియర్సు వచ్చి కూడా యింకా డబ్బుల్లేవంటే ఎలా? మీకన్నా మీ అటెండరే నయమనిపించాడు. పేరుకు మాత్రం పెద్ద హోదా! ఇంట్లో ఈగలమోత బైట పల్లకి మోత అన్న ట్టుంది మీ వ్యవహారం. అయినా మిమ్మల్ని అని ఏం ప్రయో జనం! మేడిపండులా ఎర్రగా బుర్రగా వున్నారనీ, గవర్న మెంటు ఉద్యోగం వెలగబెడుతున్నారనీ పైపై డాంబికాలు చూసి నన్ను మీకు కట్టబెట్టిన వాళ్ళను అనుకోవాలి. తిండి, బట్టగ్గూడా ముఖం వాచి పోతున్నాం. మీ పిసినారితనం ప్రయో జకత్వమని అందరూ అనుకుంటున్నా అసలు విషయం ఎవ రికి తెలుసూ. బాధపడేవాళ్ళం నేనూ నా కొడుకూ తప్ప.

కానివ్వండి యిలా యింకా ఎంతకాలం చేస్తారో. మాయ కట్టెకు యాభై ఏళ్ళొచ్చినా యింకా చిలకల వేట తగ్గలేదంటే నలుగురూ నవ్విపోతారు. ఈనగాచి నక్కలపాలు చేసినట్టు పిసి నారిగా కూడబెట్టటం, ఎవతో ఒక చిర్నవ్వు విసిరిందంటే యిక దానికోసం వున్నదంతా వూడ్చి యిస్తూ వెంటబట్టం..ఛీ..ఛీ! అదా జన్మంటే?

ఈ వొంటి బిగువు పోయిందంటే అప్పుడు అన్నింటికీ మేమే దిక్కవుతాం. శ్రీవారి సేవలకు వారకాంతలెవరూ రారు. తాడు కట్టించుకున్న నేరానికి నేనూ, కడుపున పుట్టిన నేరానికి కొడుకూ తప్ప ప్రపంచంలో ఎవ్వరూ మిమ్మల్ని కనీసం పలుక రించరు.

కానివ్వండి చూద్దాం, ఎవరి తల రాతలు ఎలా వున్నాయో" అని ఎక్కి ఎక్కి ఏడుస్తూ ముఖానికి వాయిల్ చీర అడ్డం పెట్టుకొని అమాంతం సోఫాలో కూలబడిపోయింది ఆది లక్ష్మి.

నిజమే, అది ముకుందరావు బలహీనత!

అర విరిసిన పూదోటలో ఆ పువ్వుమీదికీ యీ పువ్వుమీదికీ దూకి వాలుతూ తేనెల్ని జుర్రుకుంటూ ఆనందంలో తేలిపోయే తుమ్మెదకూ ముకుందరావుకూ తేడా అట్టే లేదు! ఉన్నకొద్ది పాటి తేడా అల్లా తుమ్మెదకు దాని కృషిలో ఎగిరేందుకు రెక్కలు కొట్టుకునే శ్రమతప్ప కోల్పోయేదేం లేదుగానీ ముకుందరావు విషయం మాత్రం అలాకాదు!

సొంత అవసరాలకూ, ఇంటి అవసరాలక్కూడా డబ్బుల్ని పొదుపుగా వాడుతూ రెక్కలు ముక్కలు చేసి కూడబెట్టిందంతా మురిపించే ముదితలకే చెల్లిపోతోంది. చీరగాలి తగిల్నా చిర్నవ్వు విసిరినా ఆముదంలో పడ్డ ఈగలా అక్కడే కుదురుకు నేవాడు ముకుందరావు. ఉన్నదంతా దోచి యిచ్చి దోసిళ్ళతో




ఆనందాలు జుర్రుకోవటం, జేబులు ఖాళీ అయ్యాక జ్వరపడిన గండుపిల్లిలా నెమ్మదిగా ఇంటికొచ్చి కలోగంజో తాగటం-కాళ్ళు ముడుచుకొని పడుకోవటం..అదీ అతగాడి వ్యసనం!

భార్య అలా తన బలహీనతను బహిరంగంగానే ఎత్తిపొడిచే సరికి అతగాడి అహం దెబ్బతింది.

''మీ నాన్న ఇచ్చిన కట్నానికి కంచి పట్టు చీరలు కొనటం, కార్లలో తిప్పటం కుదిరే పని కాదు. అంతగా మోజుపడితే పుట్టింటికి వెళ్ళి కావాల్సినన్ని పట్టు చీరలు కొనిపించుకో. మనసుపడితే నాక్కూడా ఓ జత పట్టు పంచెలు పట్టుకురా. కాదనే వాడెవడూ!

ఇక నా విషయం అంటావా! నేను అమ్మాయిలతో తిరిగేదీ, సర్వం వాళ్ళకు దోచి పెట్టేది సర్వాబద్ధం....'' అంటూ భార్య ముఖంలోకి సూటిగా చూసేడు ముకుందరావు.

ఆదిలక్ష్మి ముఖం మీంచి వాయిల్ చీరను విసురుగా తీసి భుజం మీద వేసుకుంది.

''మీ ఆఫీసు టైపిస్టు సుజాతకు నల్లపూసల గొలుసు చేయించలేదూ మీరు?'' అని అడిగింది సూది కళ్ళతో చూస్తూ.

ఆవిడ గూఢచర్య కళా ప్రావిణ్యానికి డంగైపోయాడు ముకుందరావు.

అలాంటి సమయాల్లో అధికంగా మాట్లాడి వివరణయిచ్చేకన్నా ఒక్క మాటతో విషయాన్ని కొట్టిపారవెయ్యటం ఉత్తమం అనుకుని-

''అంతా సర్వాబద్ధం'' అన్నాడు చెక్కల బోన్లో ముద్దాయిలా.

''సాని కొంపలెంట తిరిగి చీకటి రోగం తెచ్చుకొని క్యాంపునకు వెళ్తున్నానని చెప్పి వెళ్ళి గుప్తరోగ నిపుణుల ఆస్పత్రిలో చేర్లేదూ? అక్కడ వున్న వారం రోజుల్లో నర్సు నరసమ్మను లైన్ చేసుకొని దాంతో వ్యవహారం నడిపించ లేదూ?''

''అంతా అబద్ధం''

''సోకులాడి సావిత్రమ్మకు చీరలు కొనిచ్చి దాన్ని వెంటేసుకొని విహారయాత్రలకు వెళ్ళలేదూ?''

''అంతా అబద్ధం''

''సరే...అవన్నీ అబద్ధాలే అనుకుందాం! మన పక్కింటి వసుంధర ఊర్నించి వచ్చి పాలల్లో తోడు మజ్జిక్కోసం వచ్చి ''తోడు కావాలి'' అంటే ''ఓ..నేనుంటాను'' అంటూ గిన్నెకు బదులు దాని చెయ్యి పట్టుకోలేదూ?''

''అంతా అబద్ధం'' అన్నాడు గానీ ముకుందరావు మనసు ఆమెపేరు వినగానే వశం తప్పింది.

వసుంధరదే అందం అంటే. ఆ కోలముఖం...అందంగా అమర్చిన చేప్పిల్లల్లాంటి కళ్ళూ....కొనదేరిన ముక్కూ..తేనెకు వెన్నెల్ని రంగరించినట్టుండే వంటి రంగూ..నాజూకు శరీరం.

ఓహో!

ఆమె అందాన్ని, ఆమె చుట్టూ వలయంలా అల్లుకున్న కాంతినీ, ఆమె మేని సుగంధ పరిమళాన్ని వర్ణించేందుకు తగిన భాష లేదనుకున్నాడు ముకుందరావు.

అంతదాకా ఎందుకూ!

సర్వలోకాల్లోనూ వున్న అందగత్తెలందర్నీ దేవ వేశ్యలతో సహా ఒక చోటికి చేర్చి కోరుకోమంటే నలకూబరుడు కూడా రంభను కోరుకోడు-వసుంధరను తప్ప!

''నీకు అలా అని వసుంధర చెప్పిందా?'' ఆలోచనల నించి కొంచెం తేరుకుని అడిగేడు ముకుందరావు.

ఆదిలక్ష్మి ఖస్సున లేచింది. అదుర్తోన్న ముక్కును చేత్తో చీది ''అది మాత్రం ఎందుకు చెప్తుంది! దానిక్కూడా అది సర్దాగానే తోచిందేమో. స్నానాలగది రేకు తలుపుమీంచి అంతా గమనించి చీర గూడా సరిగా చుట్టుకోకుండానే వొచ్చాను. గిన్నెలో కొంచెం మజ్జిగపోసి యిస్తే వెళ్తూ కూడా అదెంతగా మైమరిచిపోతూ ఆనందంగా నవ్వుకుందో. సమయానికి నేను వచ్చాను గనుక సరిపోయింది కానీ క్షణం ఆలస్యమైతే ఇంటి ప్రక్కనే పెట్టేవాళ్లు యింకో కుంపటి'' అంది ఆదిలక్ష్మి.

భార్య అమాయకత్వానికి లోలోపలే సంతోషించాడు ముకుందరావు.

కొద్దిపాటి జ్ఞానం వున్నా ఏ భార్యా తన భర్తతో మరో ఆడ

**గోపరాజు నాగేశ్వరరావు**

దాని విషయం అలా చెప్పి కొంపమీదికి తెచ్చుకోదు.

వసుంధర మైమరచిపోయింది, ఆనందంగా నవ్వుకుందీ నిజమే అయినా ఆ నిజాన్ని చెప్పకుండా ''మీరేవో వెధవ వేషాలు వేశారట. ఇంకోసారి అలా వేస్తే మొగుడికి చెప్పి మక్కెలిరగ తన్నిస్తానంది'' అని చెప్పాలి గదా.

కళ్లు యింతలేసి చేసుకొంటూ ''ఐతే వసుంధరకు కోపం రాలేదంటావ్'' అన్నాడు ముకుందరావు భార్యవైపు చూస్తూ.

ఆమె భర్తను నఖ శిఖ పర్యంతం తీక్షణంగా చూసింది.

''దానికి కోపమే వచ్చిందో, సంతోషమే వేసిందో వెళ్ళి దాన్నే అడగండి. మొగుడి ఎదురుగా అడిగితే మరీ మంచిది! మంచాన పడితే ఎవర్తె వచ్చి మీకు చాకిరీ చేస్తుందో ఎప్పుడో వచ్చే వృద్ధాప్యంలో కాకుండా యిప్పుడే తెలుస్తుంది. అలాగైనా బుద్ధి తెచ్చుకొని కుదురుగా వుంటారేమో!'' అంటూ మూతి విరిచి లోపలికి వెళ్ళిపోయింది ఆదిలక్ష్మి.

సరిగ్గా అప్పుడే అబ్బాయి రామబ్రహ్మం ముస్తాబై వచ్చాడు.

''నాన్నా! నాకో పాతిక రూపాయలు కావాలి'' అన్నాడు చెప్పుల్లో కాళ్ళు దూరుస్తూ.

''ఎందుకట?''

''హోటలుకు వెళ్ళి టిఫెన్ చెయ్యాలి''

''ఇంట్లో మీ అమ్మేం చెయ్యలేదా?''

''చేసింది''

''మరి?''

''బొంబాయిరవ్వ ఉప్మా చేసింది. అది వాల్‌పోస్టర్లు అంటించటానికి బావుంటుందిగానీ తినటానికి బాగుండదు''

''చూడు నాయనా బ్రహ్మం! ఈ సృష్టిలో వున్న ఏ అందాన్నిగానీ, తినే పదార్థాన్నిగానీ చులకనగా చూడకూడదు. అన్నింటినీ ఆరాధించాలి..అనుభవించాలి. అప్పుడే జన్మ సార్థక్యమయ్యేది. వాటిలో కొన్ని మంచివి, కొన్ని చెడ్డవి అన్న భావనే రానివ్వకూడదు. కొన్నింటిని చేతులారా కోల్పోకూడదు. సమవర్తిలా వుంటేనే జీవితం!'' చెప్పేడు ముకుందరావు.

''నాకు ఆకలి వేస్తోంది''

''అదే నాయనా జీవులకూ జడ పదార్థాలకూ వున్న భేదం!''

''ఐతే పాతిక రూపాయలు యివ్వనంటారా?''


''అదే నాయనా పేదరికానికీ సంపన్నతకూ వున్న భేదం!''

''అవ్వేం కాదులేగానీ యిది కరుణకూ, కాఠిన్యానికీ వున్నభేదం'' అన్నాడు రామబ్రహ్మం నడచి వెళ్ళిపోతూ.

ముకుందరావు బిత్తరపోయి పలుపుగుంజలా నిలబడిపోయాడక్కడే.

★★★

సాయంత్రం ఆఫీసు నించి ఇంటికి వచ్చి స్నానం చేసి ముస్తాబై మళ్ళీ బయలుదేరాడు ముకుందరావు.




''ఎక్కడికి?'' అడిగింది ఆదిలక్ష్మి.

చెప్పుల్లో కాళ్ళు దూరుస్తున్న ముకుందరావు కోపంగా చూస్తూ ''అడిగేవూ..యిక కార్యానికి విఘ్నం ఖాయం. అయినా బయల్దేరేప్పుడు ఎక్కడికి అని అడగొద్దని నీకు ఎన్నిసార్లు చెప్పానూ!'' అన్నాడు మందలింపుగా.

ఆదిలక్ష్మి ముఖం చిన్నబుచ్చుకుంది.

''ఏదో లెండి. అలా అలవాటైంది. అయినా 'ఎక్కడికి' అని అడిగినంత మాత్రాన పనులకు విఘ్నాలు జరిగేది ఖాయమే ఐతే ఎలక్షన్లో నామినేషన్ వెయ్యబోతోన్నప్పుడు ప్రత్యర్థులలా అడక్కుండా వుంటారా? అదుర్తి సెంటిమెంటేగానీ నిజంకాదు. అయినా మీరేం రాచకార్యాలకు వెళ్తున్నారనీ, విఘ్నం కలిగితే నష్టపోయేందుకు! అంతగా టైపిస్టు కనిపించకపోతే నర్సు నరసమ్మ. అదీ అందుబాట్లో లేకపోతే సావిత్రమ్మ. ఆవిడ కాదంటే మరో అంకాళమ్మ! ఇంతమందిని తప్పించుకొని విఘ్నం మాత్రం ఏం చెయ్యగలదూ...'' అని దీర్ఘం తీసింది.

ముకుందరావు ఆమె వేపు గుర్రుగా చూసేడు. మౌనంగా వెళ్ళిపోయాడు.

గడప దాటక ముందే అడిగింది ఆదిలక్ష్మి-''ఐతే నాకు పట్టుచీర ప్రాప్తం లేనట్టేనా?''

''అంత డబ్బుపెట్టి యిప్పుడు నీకు పట్టుచీరకొనే అవకాశం నాకు లేదు'' అని కచ్చితంగా చెప్పి బైటికి వెళ్ళిపోయాడు ముకుందరావు.

తాను తలచిందే దైవమూ తలచినట్టు సరిగ్గా వసుంధర ఇంటి దగ్గరికి వెళ్ళగానే అప్పుడే ఇంటికి తాళం పెట్టి వీధిలోకి వచ్చింది వసుంధర. ముకుందరావును చూసి అందంగా నవ్వింది.

''ఏమిటి, ఎక్కడికో బయల్దేరినట్టున్నావ్?'' అడిగేడు ముకుందరావు.

''మీరో?''

''బజారుకే!''

''ఐతే ఇద్దరం కలిసే వెళ్ళొచ్చు'' అని కొంటెగా అతడి వేపు చూసింది వసుంధర.

ముకుందరావు ఆనందంతో తబ్బిబ్బవుతూ ''అంతకన్నా అదృష్టమా...పద!'' అన్నాడు గాలిలో తేలిపోతూ.

ఇద్దరూ కలిసి ప్రక్క ప్రక్కనే నడుస్తున్నారు. మధ్య మధ్యలో ఆమె శరీరాన్ని అతడికి అంటిస్తూ గుండెలో కోర్కెల కొలిమినీ అంటిస్తోంది. గలగలా నవ్వుతోంది. చాపల్లాంటి కళ్ళను విచిత్రంగా తిప్పుతూ తీయని కబుర్లు చెబుతోంది.

''నువ్వంటే నాకు చాలా యిష్టం వసుంధరా!'' అన్నాడు ముకుందరావు దారిలో.

గోముగా అంది వసుంధర-''కోర్కెనలా మనసులోనే దాచుకొని చాలాకాలం వృథా చేశారు.''

అతడి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి!

''మనిద్దరం అలా పార్కుకు వెళ్దామా?'' అడిగేడు.

''పార్కొద్దు పాడొద్దుగానీ సుబ్బారావు బట్టల కొట్టుకు వెళ్దాం''

''ఎందుకూ?''

''ఆమధ్య మీ ఆవిడ, అనసూయమ్మగారూ ఆ కొట్టుకు వెళ్ళారట. అక్కడ నెమలిపింఛం రంగు పట్టుచీర చూశారట. చాలా బాగుందని చెప్పారు. అలాంటి రంగు చీరంటే నాకు చాలా ఇష్టం. మావారికి చెప్పేనుగానీ ఆయన పట్టించుకుంటేనా! అందుకే తెంపుచేసి బయల్దేరాను. నాదగ్గరో రెండొందలున్నాయి. అంతవరకు యిచ్చి మిగిలింది తర్వాత యిస్తానని సుబ్బారావును బతిమాలైనా ఆ చీర తెచ్చుకోవాలి..'' అన్నది వసుంధర.

ముకుందరావు ఆమె వేపు అదోలా చూసేడు. ''పిచ్చి దానా..నువ్వు చందమామ కావాలన్నా రాకెట్లో వెళ్ళి తెస్తాను. అలాంటిది నీకు పట్టుచీర కొనిపెట్టనా! ఆ భాగ్యానికి నువ్వు సుబ్బారావును బతిమాలటం ఎందుకూ?'' అన్నాడు ఛాతీ ఉబ్బిస్తూ.

ఇద్దరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ సుబ్బారావు బట్టల కొట్టుకు వెళ్ళారు.

ఆమె కోరుకున్న చీర షాపులో అలాగే వుంది.

కనీసం బేరం కూడా చెయ్యకుండా షాపువాళ్ళు అడిగినంత ధర చెల్లించి పట్టుచీర పార్శిలు వసుంధరకి యిస్తూ కొంటెగా చూసేడు ఆమె వేపు ముకుందరావు.

★★★

ఆరోజు శ్రావణ శుక్రవారం. ప్రొద్దున్నే తలార స్నానం చేసి పట్టుచీర కట్టుకొని నొసటన రూపాయంత బొట్టు పెట్టుకొని పూలసజ్జ చేత పట్టుకొని గుడికి బయల్దేరింది ఆదిలక్ష్మి.

వరండాలో వాలు కుర్చీలో పడుకొని దినపత్రిక చదువుతున్నాడు ముకుందరావు. ''పట్టుచీర ఎలావుందండీ?'' అన్న భార్య మాటలకు తలెత్తి చూసి కొయ్యబారిపోయాడు!

అతను ఎంతో ప్రేమగా నిన్న వసుంధరకి కొనిపెట్టిన నెమలి పింఛం రంగు చీర కట్టుకొని కనిపించింది ఆదిలక్ష్మి.

సరిగ్గా అప్పుడే తనూ ముస్తాబై వచ్చింది వసుంధర. ''అక్కా! ఇక వెళ్దామా గుడికి?'' అన్నది ఆదిలక్ష్మితో.

''ఆహా..!'' అంటూ కదిలింది ఆదిలక్ష్మి.

ఇద్దరూ గుంభనంగా నవ్వుకుంటూ వెళ్ళిపోయారు గుడికి.

''చీర ఎలావుంది?'' అని ఆవిడ గుడినించి రాగానే మళ్ళీ అడిగి తనను పీడిస్తే ఏం సమాధానం చెప్పాలో తోచక తలపట్టుక్కూర్చున్నాడు ముకుందరావు.

★